క్లుప్తంగా

హాస్యానికి చిరునామా అల్లు రామలింగయ్య



విజయవాడ కల్చరల్: సున్నిత హాస్యానికి చిరునామా సినీ నటుడు అల్లు రామలింగయ్య అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. సాంస్కృతిక కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం విలాస్‌లో గురువారం రామలింగయ్య వర్ధంతి నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ ఆయన 11 వందల సినిమాల్లో నటించినట్లు తెలిపారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ ఆయన గరికపాటి రాజారావు చిత్రంలో నటన ప్రారంభించారన్నారు. ఆయన కుటుంబంలో చాలామంది సినీ రంగంలోనే ఉన్నారన్నారు. ఉత్తమాభిరుచి కలిగిన నిర్మాతగా అభివర్ణించారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతోనూ రాష్ట్ర ప్రభుత్వం రఘుపతి వెంకయ్య పురస్కారంతో సత్కరించిందని తెలిపారు. పలువురు గాయనీ గాయకులు పాల్గొన్నారు.

అర్చకులకు షోకాజ్ నోటీసులు సరికాదు

మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో శ్రీ గోపీనాథ స్వామి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న అర్చకులకు రాజకీయాలు ముడిపెట్టి షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నసమన్వయకర్త మల్లాది విష్ణు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలూరిపేటలోని పురుషోత్తపట్నంలో వేంచేసియున్న శ్రీ గోపీనాథ స్వామి వారి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో అర్చక స్వాములు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గత నెల 25వ తేదీ శుక్రవారం వందల మంది భక్తులు ఆలయానికి విచ్చేస్తే వారికి ఆలయ అర్చకులు పూజలు చేసి ఆశీర్వచనాలు ఇచ్చారని తెలిపారు. దానికి అర్చకులకు రాజకీయాలు అంటగట్టి షోకాజ్ నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అర్చకులకు ప్రభుత్వం, దేవదాయ శాఖ అధికారులు రాజకీయాలు ముడిపెట్టి ఇటువంటి చర్యలకు ఉపక్రమించడం చాలా దౌర్భాగ్యమన్నారు. వెంటనే ఈ చర్యలను, షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో ఓ అర్చకుడు దేవదాయ శాఖ అధికారుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అర్చకుడి మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విష్ణు డిమాండ్ చేశారు.

టీడీపీ నేత కఠారును అరెస్ట్ చేయాలి

సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దీవీ కృష్ణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మైలవరం గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు బిజిలీ భవానీపై దాడి చేసిన టీడీపీ నేత కఠారు ఉమామహేశ్వరరావును తక్షణమే అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దీవీ కృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికురాలిపై దాడి చేసి 48 గంటలు గడిచినా అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తామని చెప్పిన పోలీసులు కేసు నమోదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. బాధితురాలు భవానీని హాస్పిటల్లో చేర్పించిన పోలీసులు ఇంతవరకు నిందితుడుని అరెస్ట్ చేయకపోవడాన్ని ప్రశ్నించారు. నిందితులు భవానీ కుటుంబ సభ్యులను ప్రలోభపరచడానికి అధికార కూటమి నాయకులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. మహిళపై దాడి చేసి 48 గంటలు గడిచినా కేసు నమోదు చేయకపోవడం, అరెస్ట్ చేయకపోవడంతో తమ అనుమానాలకు బలం చేకూరుతోందన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు సీపీఎం, సీఐటీయూ జిల్లా నాయకులకు పోలీసు అధికారులు ఇచ్చిన హామీ మేరకు నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని కృష్ణ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

తవ్వి వదిలేస్తున్నారు!

- రోడ్లు ఇలా.. రాకపోకలు ఎలా..?
- మధురానగర్, మారుతీనగర్, జీవీఆర్ నగర్‌లలో ప్రజలకు ఇక్కట్లు



జీవీఆర్‌నగర్ మెయిన్ రోడ్డులో ఇలా



దుర్గాపురంలో...



దావు బుచ్చయ్యకాలనీలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): పైపులైన్ పనులంటూ రోడ్లను తవ్వి తర్వాత వదిలేస్తుండటంతో ప్రజలకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. నగరంలో యూజీడీ, వాటర్ పైపులైన్ పనుల్లో భాగంగా రోడ్లు తవ్వేస్తున్నారు. దీంతో రోడ్లు గుంతలుపడి రాకపోకలకు ఇబ్బందికరంగా తయారవుతున్నాయి. 26వ డివిజన్ మారుతీనగర్, 27వ డివిజన్ దుర్గాపురం, బావాజీపేట, సాంబమూర్తి రోడ్డు, 28వ డివిజన్ సత్యనారాయణపురం, 29వ డివిజన్ మధురానగర్, 30వ డివిజన్ జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, 31వ డివిజన్ శ్రీనగర్‌కాలనీ, ముత్యాలంపాడుతో పాటు గాంధీనగర్, అయోధ్యనగర్ రామకృష్ణాపురం, దేవీనగర్ తదితర ప్రాంతాల్లో యూజీడీ వాటర్ వర్క్స్ పనులు జరుగుతున్నాయి. వీటిలో భాగంగా రోడ్డును తవ్వి పనులు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో వాన నీరు నిలిచిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. తవ్విన రోడ్డుకు మరమ్మతులు పూర్తయినా సరిచేయడం లేదు.

వాహనచోదకుల సహనానికి పరీక్షే..

రోడ్లు గుంతలమయంగా మారి వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే క్రమంలో గోతుల్లో పడి పలువురు గాయాలబారిన పడుతున్నారు. ఎక్కువగా మలుపు ప్రాంతాల్లో పైపులైన్‌ల పనుల కోసం తవ్వి పనులు



ముత్యాలంపాడులో...

చేశారు. తవ్విన ప్రాంతంలో కేవలం మట్టిని పోసి వదిలివేశారు. దీంతో కొద్దిపాటి వర్షానికే బురదగా మారటంతో మలుపుల్లో జారి పడుతున్నారు.

బాగున్న రోడ్లు వేస్తున్నారు! గోతులను మాత్రం సరిచేయడం లేదు..

బాగున్న రోడ్లు వేస్తున్న అధికారులు తవ్విన గుంతలను మాత్రం సరిచేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చక్కగా బాగున్న మధురానగర్ మెయిన్ రోడ్డుపై ఇటీవల రోడ్డును వేశారు. అయితే ఇక్కడకు సమీపంలో తవ్విన గోతులను మాత్రం పట్టించుకోకపోవటం గమనార్హం. నిత్యం రద్దీగా ఉండే ముత్యాలంపాడు మసీదు రోడ్డులో పైపులైన్ పనులు పూర్తై నెలలు గడిచినా ఇంతవరకు పనులు మాత్రం చేపట్టలేదు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. పలుచోట్ల రోడ్లు వేసిన తర్వాత పైపులైన్ల పనుల కోసం రహదారులను తవ్వుతున్నారు. దీంతో మరోసారి రోడ్డు వేయాల్సి వస్తోంది. గత ప్రభుత్వంలో జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలకు సైతం యూజీడీ పైపులైన్‌లు ఏర్పాటు చేసి ఆ తర్వాత రోడ్లు వేశారు. దీంతో రోడ్డును తవ్వాల్సిన పనిలేకుండా చేశారు. ఇదే విధంగా అన్ని ప్రాంతాల్లో అధికారులు సమన్వయంతో పనిచేసి విలువైన ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు 32వ డివిజన్‌లో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గంలోని 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో శుక్రవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లాది విష్ణు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలుకాని హామీలతో ప్రజలను ఎలా మోసం చేసిందో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు అయోధ్యనగర్‌లోని శివకామేశ్వరి దేవస్థానం ఎదురు మండపంలో జరిగే కార్యక్రమంలో డివిజన్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కరెంట్ లైన్ల నిర్వహణ పనులు జరగనుండటంతో శుక్రవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టు కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, ఎల్‌ఐజీ కాలనీ, ఈడబ్ల్యూఎస్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, రాధనగర్, ప్రజాశక్తి నగర్, బర్మా కాలనీ, పాయకాపురం, భగీరధ కాలనీ, ఏవీఎస్ రెడ్డి రోడ్డు, ప్రకాష్‌నగర్, లక్ష్మీనగర్, ప్రశాంతి నగర్, పటేల్ నగర్, సుందరయ్యనగర్, ఎల్‌బీఎస్ నగర్, శాంతినగర్, దేవినేని గాంధీ పురం, కండ్రిక కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

శ్రీదత్తసాయి మందిరంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో శ్రావణమాసం గురువారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు బాబావారికి విశేషంగా పూజలు చేశారు. శ్రీసాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన బాబా పారాయణం జరిగింది. మధ్యాహ్నం దాత వెంకటేశ్వరరావు, సౌజన్య దంపతులతో అన్నప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు సహకరించండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని.. దోమల నియంత్రణకు సహకరించాలని వీఎంసీ బయాలజిస్టు వాడపర్తి కామేశ్వరరావు సూచించారు. 30వ డివిజన్ వినాయకనగర్‌లో గురువారం రాత్రి దోమల నివారణ చర్యలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఖాళీ స్థలాలు, నీటి నిల్వలు అధికంగా ఉండటంతో దోమలు అధికంగా ఉంటున్నాయన్నారు. ఎక్కడైనా నీటి నిల్వలు దోమలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మురుగు కాలువలలో చెత్తచెదారం వేయడంతో మురుగు నిలిచిపోయి దోమలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. అనంతరం డివిజన్‌లో ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో వీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

వరద హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు



కృష్ణలంక(విజయవాడతూర్పు): వరద ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా కనకదుర్గ వారధి పక్కన రివర్‌ఫ్రంట్ పార్క్ వద్ద అధికారులు వరద ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా కృష్ణా నది పోటెత్తుతోంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి ప్రకాశం బ్యారేజీకి సుమారు 3లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండడంతో బ్యారేజీ అన్ని గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేశారు. కృష్ణానదిలో నీటి ప్రవాహం పెరుగుతున్నందున నదిలోకి మానవ సంచారం, పశు సంచారం పూర్తిగా నిషేధించారు. నిషేధాజ్ఞలు ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నదిలో పశువులను కట్టడానికి ఏర్పాటు చేసుకున్న టైర్లు, కర్రలను పొక్లయిన్‌తో తొలగించారు.

ఆర్థిక స్వావలంబన దిశగా మహిళల ప్రయాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆర్థిక స్వావలంబన దిశగా మహిళల ప్రయాణం అనే అంశంపై గురువారం మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని గురుకుల కళాశాలలో పెట్టుబడులపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సెబీ (సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా) కి చెందిన శిక్షకులు, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకులు ఓలేటి అచ్యుత్ రామ కిషోర్ పెట్టుబడులు పెట్టడంలో మెలకువలు, పొదుపు సేవలు, స్టాక్ మార్కెట్, ద్రవ్యోల్బణం, షేర్లు, బాండ్లు, మ్యూచువల్ ఫండ్లను వివరించారు. పెట్టుబడులు మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎలా ఉపయోగపడతాయో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కామర్స్ అధ్యాపకులు సుధారాణి, సత్యవాణి, కె.బాలకృష్ణ, అరుణ, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో సంక్షేమం కనుమరుగు



క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న మల్లాది విష్ణు, ఇతర నేతలు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జి మల్లాది విష్ణు

గుణదల (విజయవాడ తూర్పు): కూటమి పాలనలో ప్రజా సంక్షేమం కనుమరుగైందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జి మల్లాది విష్ణు అన్నారు. గుణదల ఒకటో డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచరణ సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలు పేదలకు సక్రమంగా చేరడం లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ప్రజా క్షేత్రంలో ప్రభుత్వం విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. సూపర్ సిక్స్ పేరుతో పథకాలను అమలు చేస్తామన్న నాయకులు కనుమరుగయ్యారని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత వంటి ముఖ్యమైన విభాగాలు కుదేలయ్యాయని దుయ్యబట్టారు.

1వ డివిజన్‌లో పదికోట్ల నష్టం..

గత ప్రభుత్వ హయాంలో గుణదల 1వ డివిజన్‌లో ఆసరా పథకం ద్వారా 2,166 మందికి రూ.6.2 కోట్లు, అమ్మ ఒడితో 1,794 మందికి 5.69 కోట్లు లబ్ధిదారులకు మంజూరు చేశారని గుర్తు చేశారు. అర్హులైన 16,453 మందికి రూ.47.35 కోట్లు ఇచ్చామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో పేదలు ఎటువంటి లబ్ధి పొందలేదన్నారు. 1వ డివిజన్‌లోనే దాదాపు 10 కోట్ల మేర సంక్షేమ నిధులు నిలిచిపోయాయని వివరించారు. చిత్తశుద్ధి లేని కూటమి ప్రభుత్వానికి ప్రజలే సరైన బుద్ధి చెబుతారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీనే ప్రజలు ఎన్నుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, క్లస్టర్ ప్రెసిడెంట్ పి.వంశీ, డివిజన్ నాయకులు మహేశ్వరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గ్రంథాలయాల అభివృద్ధికి సంపత్‌కుమార్ కృషి చేశారని ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ చెప్పారు. సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయ అధికారి పరస సంపత్‌కుమార్ గురువారం పదవీ విరమణ చేశారు. గ్రంథాలయంలో జరిగిన అభినందన సభలో రవికుమార్ పాల్గొని సంపత్‌కుమార్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపత్ కుమార్ అంకితభావంతో, నిజాయతీగా 31 సంవత్సరాలు సర్వీసులో ఎటువంటి మచ్చలేకుండా పని చేశారని కొనియాడారు. ఆయన విధులు నిర్వర్తించిన అనేక గ్రంథాలయాలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. అనంతరం పలువురు సిబ్బంది, పాఠకులు ఆయన్ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ హెడ్ ఆఫీస్ సూపరింటెండెంట్ విజయకుమార్, గ్రంథాలయ సంస్థ యూనియన్ అధ్యక్షుడు బీరం వెంకటరమణ, గౌరవ అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదన రాజు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

అన్నదానం, ఉచిత ప్రసాదానికి విరాళాలు



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి



రవికిరణ్ కుటుంబానికి అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న ఉచిత ప్రసాద పంపిణీకి విజయవాడకు చెందిన భక్తులు గురువారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. మాచవరానికి చెందిన వేగ శేషగిరిరావు, ఝాన్సీలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి ఉచిత ప్రసాద వితరణకు రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు అమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు, ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి నగరంలోని సీతారాంపురానికి చెందిన పిన్నింటి దుర్గా రవికిరణ్ కుటుంబం రూ.1,01,116 విరాళాన్ని గురువారం ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం అమ్మవారి దర్శనం చేయించారు.

ఎస్ఆర్ఆర్ స్థలంలో హెచ్చరిక బోర్డులు



కాలేజీ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆక్రమణకు గురైన స్థలంలో గురువారం కాలేజీ సిబ్బంది, మాచవరం పోలీసుల సహకారంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కళాశాలకు చెందిన 6.67 ఎకరాల స్థలం ఆక్రమణలకు గురవడంతో 'సాక్షి' పలుమార్లు కథనాలు ప్రచురించింది. పూర్వ విద్యార్థులు పోరాటం చేశారు. దీంతో కళాశాల సిబ్బంది, పూర్వ విద్యార్థుల విజ్ఞప్తి మేరకు కలెక్టర్ లక్ష్మీశ కళాశాల స్థలాన్ని ఎన్‌టీఎస్ నంబర్ 39, 40 సంబంధిత సర్వే నంబర్లలోని ఈ భూమిని రిజిస్ట్రేషన్ చట్టం 1908, సెక్షన్ 22–ఏ ప్రకారం నిషేధిత భూమిగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిషేధిత భూమిలో ఎవరైనా క్రయవిక్రయాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేస్తూ, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ప్రస్తుత విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొని 'ప్రభుత్వ భూమి – ప్రజల ఆస్తి, కాపాడుకుందాం' అనే నినాదాలతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

భావవ్యక్తీకరణ చాలా కీలకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు చక్కని భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే అద్భుత విజయాలను సొంతం చేసుకుంటారని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సీహెచ్ రమేష్ బాబు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈసీఈ, ఐక్యూఏసీ విభాగాల ఆధ్వర్యంలో 'స్పీక్ టు లీడ్ మాస్టరింగ్ ది ఆర్ట్ ఆఫ్ పబ్లిక్ స్పీకింగ్' అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రేరణాత్మకమైన ప్రసంగాలు చేసే దిశగా తమ ప్రతిభకు పదును పెట్టాలన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, కోశాధికారి కాజా రాఘవయ్య, సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు 2025–26 సంవత్సరానికి సివిక్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.సంధ్య మాధురి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిక్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లలో పీజీలో 50 శాతంపై మార్కులు సాధించిన వారు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 2వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని రావాలని, అభ్యర్థులకు డెమో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

సత్తాచాటిన కేవీ విద్యార్థి

10 మీటర్ల పీప్‌సైట్ ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో అభిషేక్‌కు కాంస్య పతకం



అభిషేక్‌ను అభినందిస్తున్న కేవీ ప్రిన్సిపాల్ ఆదిశేషశర్మ

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని పి.ఎం.కేంద్రీయ విద్యాలయం నం.1లో పదో తరగతి విద్యార్థి అభిషేక్ జుత్తిగ 54వ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ నేషనల్ స్పోర్ట్స్ మీట్‌లో 10 మీటర్ల పీప్ సైట్ ఎయిర్ రైఫిల్ షూటింగ్ అండర్ 17లో కాంస్య పతకం సాధించి సత్తాచాటాడు. జూలై 21 నుంచి 25వ తేదీ వరకు లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, పంజాబ్‌లో నిర్వహించిన పోటీలలో అభిషేక్ హైదరాబాద్ రీజియన్ తరఫున ప్రాతినిధ్యం వహించి తృతీయస్థానంలో నిలిచాడు. అభిషేక్ అత్యుత్తమ ప్రదర్శనను గుర్తించి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో అభిషేక్ అభినందన కార్యక్రమం జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ ఆదిశేష శర్మ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభిషేక్, కోచ్ భరత్ పాఠక్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఏడుకొండలును అభినందించారు.

'సౌండ్' లేదు!



పోలీస్ కమిషనరేట్‌లో గురువారం శబ్ద కాలుష్యం కలిగిస్తున్న ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను పోలీసులు తీసేసి రోడ్ రోలర్‌తో తొక్కించారు. కార్యక్రమంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, సీపీ రాజశేఖరబాబు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ